క్లుప్తంగా

నేడు బొల్లాపల్లిలో వైఎస్సార్ ఆసరా పథకం సంబరాలు

బొల్లాపల్లి: మండల కేంద్రంలో నేడు వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ ఉంటుందని వెలుగు పథకం ఇన్‌చార్జి ఏపీఎం రంగారెడ్డి తెలిపారు. నియోజకవర్గ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారని అన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొనాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు ట్రాఫిక్ ఆంక్షల మినహాయింపు

నాదెండ్ల: ఈ నెల 6న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిలకలూరిపేట మండలంలోని లింగంగుంట్లకు రానున్న నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు రూరల్ సీఐ వై.అచ్చయ్య తెలిపారు. చిలకలూరిపేట-నరసరావుపేట మార్గ మధ్యంలోని లింగంగుంట్లలో 6వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. కోటప్పకొండ రహదారి మీదుగా ట్రాఫిక్ మళ్లించినట్లు తెలిపారు. అయితే ఈ రహదారి మీదుగా ఉదయం 8 గంటలకు పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వారు ప్రయాణించే ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సులకు మినహాయింపునిచ్చినట్లు తెలిపారు.

ఆరోగ్య సంరక్షకులు ఆశాలే

యడ్లపాడు: గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సంరక్షకులు ఆశ కార్యకర్తలేనని వైద్యాధికారి గోపీనాయక్ తెలిపారు. మంగళవారం ఆశ డే కార్యక్రమంలో భాగంగా యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లు తమకు కేటాయించిన గ్రామాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉంటాలన్నారు. మాతశిశు సంరక్షణలో అసలు రాజీ పడకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వ పలు ఆరోగ్య పథకాలను అమలు చేస్తుందన్నారు. అనంతరం కొత్త రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పున్నారావు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంపులు మరమ్మతుకు గురైతే తెలపండి

శావల్యాపురం: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 455 చేతి పంపులు ఉన్నాయని ఏమైనా గ్రామాల్లో చేతి పంపులు మరమ్మతులకు గురైతే తక్షణమే వారి పరిధిలో గ్రామ సచివాలయల్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే సత్వరమే స్పందిస్తామన్నారు. చేతి పంపులకు సంబంధించి మెటీరియల్ కొరత లేదన్నారు. నూతనంగా ఎంపీపీ గ్రాంటు ద్వారా ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన 11 మంది ఎంపీటీసీలు ఏర్పాటు చేస్తున్న చేతి పంపులకు సంబంధించిన రూ. 17 లక్షలు విలువ చేసే సామగ్రి కూడా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

పంట పొలాలు ఆహుతి

శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెం-వయ్యకల్లు గ్రామాల పరిధిలో పంట పొలాల్లో ప్రమాదశాత్తు నిప్పు పడిన సంఘటనలో పంట నష్టం వాటిల్లిన ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు... రెండున్నర ఎకరాలు మొక్కజొన్న పంటను రైతు కావూరి వెంకటేశ్ సాగు చేయగా అందులో ఎకరం పూర్తి స్థాయిలో అగ్నికి అహుతి అయిందని రూ. 90 వేలు నష్టం వాటిల్లిందన్నారు. అలాగే ధూళిపాళ్ళ పూర్ణచంద్రరావు చెందిన చేతికి వచ్చిన మిరప పంటతో పాటు డ్రిప్ పైపులు కాలిపోగా రూ. ఒక లక్ష, కొర్రపాటి ఆంజనేయులు పొలంలో డ్రిప్ పైపులు రూ.50 వేలు విలువ చేసే వస్తువులు అగ్నికి ఆహుతైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రైతులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తేవడంతో పెనుప్రమాదం తప్పినట్లు మిగిలిన రైతులు ఊపిరి పిల్చుకున్నారు.



కలెక్టరేట్‌లో పౌరసంబంధాల శాఖ ఏర్పాటుచేసిన చాయాచిత్రప్రదర్శనశాలలో ఫొటోలను తిలకిస్తున్న మంత్రులు కారుమూరి, అంబటి, జిల్లా కలెక్టర్ శివశంకర్



నవోదయం కింద మంజూరైన వాహనాన్ని రిబ్బన్ కట్ చేసి ఆరంభిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, పక్కన మంత్రి కారుమూరి, కలెక్టర్ శివశంకర్, తదితరులు



కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఫుడ్‌కోర్టును ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఏడాది పండుగ

పల్నాడు జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్‌లో మంగళవారం ప్రథమ వార్షికోత్సవ సభ జరిగింది. కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్‌లు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ శ్యాంప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. -సాక్షి, నరసరావుపేట

పరిశుభ్రత- పట్టణాభివృద్ధే లక్ష్యం

- ఇందుకు పట్టణ వాసులూ సహకరించాలి
- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి
- కమిషనర్‌తో కలిసి పట్టణంలో పర్యటన



రోడ్డుపైనున్న మట్టికుప్పను తొలగించాలని అధికారులకు చూపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ అభివృద్ధి వైపు తీసుకెళుతున్నామని, దీనికోసం తాము చేస్తున్న కృషికి ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పురవీధుల్లో చెత్త తొలగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం మోటార్ సైకిల్‌పై మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస రావుతో కలిసి 25, 26 వార్డుల్లో పర్యటించారు. పెద్ద చెరువులోని పాత శివ గెస్ట్ హౌస్, ఫైర్‌స్టేషన్, పలు ప్రాంతాల్లో పారిశుధ్యం పరిశీలించారు. స్థానికులను తాగునీరు, పారిశుధ్యంపై ఆరా తీశారు. స్టేడియం ప్రక్కగా కత్తవ డ్రెయిన్‌లో మున్సిపల్ జేసీబీ చేస్తున్న పూడిక తీత పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పచ్చదనంతో పాటు పరిశుభ్రత కూడా చాలా అవసరమన్నారు. అన్ని ప్రాంతాలలో మురికి, మురుగు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశుభ్రమైన వాతావరణం ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. చెత్త ఎవ్వరూ రోడ్లపై వేయవద్దని, మీ దగ్గరకు వచ్చిన మున్సిపల్ వాహనాల్లోని సిబ్బందికి ఇచ్చి మున్సిపాల్టీకి సహకరించాలని కోరారు. దయచేసి ప్రజలందరూ అభివృద్ధికి సహకరించి పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచుకుందామన్నారు. శాంతి నగర్‌లో పిల్టర్ బెడ్లు రూ.3.5 కోట్ల వ్యయంతో బాగు చేయించామని, వచ్చే ఐదేళ్లలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. జిల్లా కేంద్రంగా నరసరావుపేటను ఏర్పాటు చేసుకుని ఏడాది పూర్తవుతుందన్నారు, ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిన జిల్లా కేంద్రాన్ని ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలియచేస్తున్నామన్నారు. పట్టణం విపరీతంగా పెరుగుతుందని, ఓటర్‌రింగ్ రోడ్డు మించి అభివృద్ధి జరుగుతుందన్నారు. సుమారు 150 అపార్టుమెంట్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి వైపు పట్టణాన్ని ముందుకు తీసుకెళుతున్నామన్నారు. దీనికి సహకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియచేశారు. పురపాలక పరిధిలో 2021-2022 ఆర్థిక ఏడాదికి రూ.7 కోట్లు ఆస్తిపన్ను వసూలు కాగా, 2022-2023 సంవత్సరానికి రూ.13.76 కోట్లు చెల్లించి సహకరించిన ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఓలేటి శ్రీనివాసరావు, టీపీఎస్ అనూరాధ, వైఎస్సార్‌సీపీ నాయకులు జోనల్ ఎస్సీ ఇన్‌చార్జి పాలపర్తి వెంకటేశ్వరరావు, పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు అచ్చి శివకోటి, మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావలి, షేక్ మాబు, నిడమానూరి సురేంద్ర, హాలీవుడ్ రఘు, మునిసిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు 'సంక్షేమ' భరోసా



డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వైఎస్సార్ ఆసరా పథకం సంబరాలు
- 669 గ్రూపులకు గాను రూ.3.89 కోట్లు జమ

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారికి భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక కారంపూడి రోడ్డులోని బొల్లా బ్రహ్మనాయుడు కన్వెన్షన్ హాల్‌లో వినుకొండ మండల వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మండల పరిధిలోని 669 గ్రూపులకు గాను రూ.3.89 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. మన ప్రాంత మహిళల తరపున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పేద ప్రజల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి మహిళల పేరుపై పట్టాలు మంజూరు చేసినట్లు వివరించారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి అనేక సంక్షేమ పథకాలు మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఉద్యోగాల్లో తదితర రంగాల్లో మహిళలకు రిజర్వేషన్‌లు కల్పించినట్లు చెప్పారు. మహిళలు డ్వాక్రా రుణాల ద్వారా, ప్రభుత్వం సాయం కింద వచ్చే నగదును సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోనే వినుకొండను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, జడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, సొసైటీ అధ్యక్షులు అనుమోలు నాసరరెడ్డి, ఎంపీటీసీ మాలపాటి కోటిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ రొడ్డా పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, ఏపీఎం సత్యానందంతో పాటు మండలస్థాయి అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీన నియోజకవర్గంలోని అన్ని గ్రామసచివాలయాల్లో ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వెల్లడించారు. స్థానిక కారంపూడి రోడ్డులోని బొల్లా బ్రహ్మనాయుడు కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ తెలియజేస్తూ లబ్ధిదారులను కలుస్తూ ప్రభుత్వ పథకాలు ప్రచారం చేసేవిధంగా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి పార్టీ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంపై ఈ నెల 5వ తేదీన వినుకొండ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఐదు మండలాల నేతలతో, గృహసారథులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కేసులతో అభివృద్ధి అడ్డుకుంటున్నారు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయసహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని తనదైన శైలిలో అభివృద్ధి పనులు చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోర్టులో కేసులు వేసి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, నియోజకవర్గ అభివృద్ధికి శనిగ్రహంలా మారారని విమర్శించారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న మాజీ ఎమ్మెల్యే జీవీ చెప్పుకునేందుకు ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేకపోయారని, మేము అభివృద్ధి చేస్తుంటే చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కనీసం తన స్వగ్రామం ఇనిమెళ్లకు కనీసం రోడ్డు కూడా వేసుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. నా స్వగ్రామమైన వేల్పూరులో కళ్యాణమండపం, కోల్డ్ స్టోరేజీ, గ్రామీణ హెల్త్ సెంటర్, గిడ్డంగులతో పాటు కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలను మానుకొని చేతనైతే మంచి పనులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ రాజా, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, మండల కన్వీనర్ దండు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో 85 శాతం కుటుంబాలకు లబ్ధి

నాదెండ్ల: వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో 85 శాతం కుటుంబాలకు లబ్ధి చేకూరి ఆయా కుటుంబాల్లో ఎంతో సంతోషంగా ఉన్నారని జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. ఈ నెల 6వ తేదిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిలకలూరి పేట మండలం, లింగంగుంట్లలో ఉదయం 10 గంటలకు జరిగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న నేపథ్యంలో కార్యక్రమ విజయవంతానికి పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ముఖ్యమంత్రి కార్యక్రమ ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి ఆర్టీసీ బస్సులు సభకు ఏర్పా టు చేశామని, ఉదయం 8 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు. యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, నాదెండ్ల సొసైటీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి ఉన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గసభ్యులకు సన్మానం



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నూర్‌బాషా సంఘం సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక న్యాయవాది సంఘం అసోసియేషన్ కార్యాలయం నందు వినుకొండ పట్టణ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నూర్ బాషా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నుకున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు చాగంటి వీరాంజనేయ చౌదరి, ట్రెజరర్ కాకాని నాగేశ్వరరావు, సెక్రటరీ కొత్తకోట హనుమంతరావులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నూతన కార్యవర్గం మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో నూర్ బాషా సంఘం నాయకులు చాపలమడుగు చిన్నసైదా, గాజులపాలెం నాసర్‌వలి, దూదేకుల హుస్సేన్, దూదేకుల సిద్ధయ్య, సైదావలి, పీర్ సాహెబ్, సీహెచ్. నాగూర్, హుస్సేన్, దూదేకుల వెంకటసైదావలి, ఎ. సైదావలి తదతరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో మహిళ అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో మహిళను అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు మంగళవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు.. బరంపేటలోని ఓ గృహంలో తనిఖీలు నిర్వహించామన్నారు. అక్కడ తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా మద్యం విక్రయాలకు పాల్పడుతున్న గృహ యజమాని పుణ్యవతిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌బీకేలతో అత్యుత్తమ సేవలు



మతుకుమల్లి రైతుభరోసా కేంద్రం సందర్శించిన ఏవో

శావల్యాపురం: రైతులకు కావలసిన అత్యుత్తమ నాణ్యమైన సేవలన్నీ కూడా రైతుభరోసా కేంద్రాల ద్వారా లభిస్తాయని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని పిచ్చికలపాలెం, మతుకుమల్లి, కారుమంచి, గుంటుపాలెం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల వలన కలుగు ప్రయోజనాలు రైతులకు వివరించారు. ఈఏడాది నుంచి మట్టి పరీక్షలు చేసి ఫలితాలను గుర్తింపు కార్డు ద్వారా రైతులకు అందజేస్తామన్నారు. వ్యవసాయ యంత్రీకరణ డ్రోన్ పరికరాలు శిక్షణ పొందిన వారు, వాటి పనితీరు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంటుందన్నారు. మండలంలోని చినకంచర్ల, గుంటుపాలెం గ్రామాల్లో ఆకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న నష్టం వాటిల్లికుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులను కోరారు. ఆయనతో పాటు సర్పంచ్‌లు పురేటి నాగేశ్వరరావు, తిరివిధి రమణారావు, కారుమంచి సొసైటీ అధ్యక్షులు బొల్లా వెంకట సాంబశివరావు, వ్యవసాయ ఉద్యానశాఖ సహాయకురాలు కె.బాలాజీ, వీఏఏలు వరలక్ష్మి, ఆదాము, జె.ప్రసాదు, రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ



గణపవరంలో వృద్ధాప్య పింఛను లబ్ధిదారు శారమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్

నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక - సామాజిక భద్రతా పెన్షన్‌ల పంపిణీ మంగళవారం 50 శాతం పూర్తి చేశారు. ఏప్రియల్ మాసంలో బ్యాంకులకు వరుసగా సెలవులు కావటం, సోమవారం బ్యాంకుల్లో సర్వర్‌లు పని చేయకపోవటంతో నగదు విత్‌డ్రా చేయటంలో సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో పింఛన్ల పంపిణీ ఆలస్యంగా బుధవారం ప్రారంభమైంది. మండల పరిధిలో 9314 పింఛన్లకు గాను రూ.2,56,84,000లు పంపిణీ చేయాల్సి ఉంది. ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము పంపిణీ చేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

రీసర్వే పనుల్లో రైతుల సహకారం తప్పనిసరి

శావల్యాపురం: రీసర్వే పనులకు రైతుల తప్పనిసరిగా రెవెన్యూ అధికారులకు తమవంతు సహకారం అందించాలని తీసుకున్నట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ రెండవ విడతలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో రైతుల సమక్షంలో రోవర్ యంత్ర పరికరాలు ద్వారా రెవెన్యూ, సచివాలయ సర్వేయర్లు సారథ్యంలో భూములకు సంబంధించి కొలతలు సరిహద్దులను గుర్తించి అన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. కనమర్లపూడి రెవెన్యూ గ్రామంలో రికార్డు పనులు పూర్తి కాగా ఈనెలాఖారులోగా అర్హత కలిగిన రైతులందరికీ భూహక్కు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వేల్పూరు, శానంపూడి, పోట్లూరు, పిచికలపాలెం రెవెన్యూ గ్రామాల్లో భూములకు సంబంధించిన సర్వే పనులు పూర్తి చేశామని, ప్రస్తుతానికి రికార్డు పనులు జరుగుతున్నాయన్నారు. ఆయనతో పాటు డిప్యూటి తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు.మండల డిప్యూటీ సర్వేయరు తుంగా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవటం ప్రతి ఒక్కరి కర్తవ్యం



నాదెండ్ల: ప్రతి వ్యక్తి తన సంపాదనలో కొంత భాగాన్ని పేదలు, అన్నార్తులకు సాయంగా అందించాలని ఇస్లాం ధర్మం బోధించిందని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా చెప్పారు. మండలంలోని గణపవరం గ్రామంలో గల మసీదుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.1 లక్ష ఆర్థికసాయాన్ని మసీదు కమిటీ సభ్యులకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి, సోదరభావాన్ని ఇస్లాం ప్రభోధిస్తుందన్నారు. భగవంతుని ప్రసన్నత కాంక్షిస్తూ ముస్లిం సోదరులు రంజాన్‌లో విరివిగా దానధర్మాలు చేస్తారన్నారు. తన వంతుగా మసీదు నిర్వహణకు ఆర్థికసాయం చేయటం సంతోషంగా ఉందన్నారు.

ఘనంగా రెడ్డినగర్ తిరునాళ్ల



నరసరావుపేట రూరల్: రెడ్డినగర్‌లో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి వారి 21వ తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆకుపూజలో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పాస్టర్‌పై యువకుల దాడి

చిలకలూరిపేటటౌన్: పాస్టర్‌పై ఇరువురు వ్యక్తులు దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యేక్ష సాక్షులు, స్థానికులల కథనం ప్రకారం... పట్టణానికి చెందిన ముంగమూరి మనోహర్ తన ప్రార్థనా బృందంతో కలసి సైకిల్‌పై మైకు పెట్టుకొని మండలంలోని కోమటినేనివారిపాలెం గ్రామంలో వీధి సువార్త నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అటుగా వెళుతున్న అదే గ్రామానికి చెందిన బొడ్డు శ్రీకాంత్ తన మిత్రుడితో కలసి దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాధితులు రూరల్ పోలీసులను ఆశ్రయించారు.